
సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 9 । జూలై । 2023



రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని శనివారం సుమారు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,390, మధ్య డెల్టాకు 1,710, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.0° / 25.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	37.0	26.0
కాకినాడ	35.0	25.5
అమలాపురం	36.0	27.0

మహానేతా.. మనసా స్మరామి

- జిల్లాలో ఘనంగా వైఎస్సార్ జయంతి
- రాజానగరంలో మెగా వైద్యశిబిరం
- నివాళులర్పించిన నాయకులు.. అభిమానులు

రాజమహేంద్రవరం రూరల్: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి జిల్లావ్యాప్తంగా నివాళులర్పించారు. ఆయన జయంతి సందర్భంగా శనివారం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వాడవాడలా వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు, అభిమానులు పూలదండలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

రాజానగరం: రాజానగరంలో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జీఎస్ఎల్,సుభద్ర ఆసుపత్రిలకు చెందిన 40మంది వైద్యులు పాల్గొని 14రకాల వైద్యసేవలు అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లాఅధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్‌సీపీ పీఏసీసభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. ఉచితంగా మందులను అందించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు జక్కంపూడి రాజా తెలిపారు. కోరుకొండలో రక్తదానశిబిరాన్ని డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పర్యవేక్షించారు.



రాజానగరంలో జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరానికి స్పందన

అనపర్తి: అనపర్తి మెయిన్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: దేవరపల్లి,గోపాలపురంలలో ఎమ్మెల్యే తలారి వెంకటరావు కేక్ కట్ చేసి ప్రభుత్వాసుపత్రిల్లో రోగులకు పండ్లు,రొట్టెలు పంపిణీ చేశారు.గోపాలపురంలోని అంబేడ్కర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులకు ఎమ్మెల్యే పాఠ్యపుస్తకాలు,నోట్‌పుస్తకాలు పంపిణీచేశారు.

నిడదవోలు: నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పండ్లు,రొట్టెలు పంపిణీ చేశారు. రూ.85లక్షలతో నిర్మాణం చేపట్టిన వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పార్టీనేతలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంసిటీ: ఎంపీ భరత్‌రామ్ కార్యాలయంలో వైఎస్సార్‌విగ్రహానికిపార్టీ సీటీ కోఆర్డినేటర్ డా.గూడూరి శ్రీనివాస్, ఉభయ రాష్ట్రాల బీసీసంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతుసూర్యప్రకాశరావులు పూలమాలలు వేశారు. క్వారీసెంటర్‌లో అజ్జరపు వాసు ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ జరిగింది. లాలాచెరువు సెంటర్‌లో గుత్తులమురళీధర్ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు షర్టులు,మహిళలకు చీరలను డా.గూడూరి,మార్గాని,రౌతు పంపిణీ చేశారు. కోటగుమ్మం సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో వీరితోపాటు రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి,, వైఎస్సార్‌సీపీ యుజవనవిభాగ రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులు 74కిలోల కేక్‌ను కేక్ కట్ చేశారు.

రాజమహేంద్రవరం రూరల్: ,ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ బొమ్మూరులో వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ధవళేశ్వరం టిడ్కో గృహాల వద్ద, శాటిలైట్ సిటీ బస్టాండ్‌సెంటర్‌లో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కడియపులంకలో వైఎస్సార్‌విగ్రహానికి డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొవ్వూరు: కొవ్వూరులోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు,పండ్లు,రొట్టెలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ భావనరత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైస్‌చైర్మన్ గంధ్రోతుఅంజలీదేవి, ఏఎంసీమాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు,వల్లభశెట్టిశ్రీనివాస్,కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఐ.పంగిడిలో జిల్లా యువజనవిభాగఅధ్యక్షుడు చవుటపల్లి వీరన్న ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు.





నల్లజర్లలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, కేక్ కట్ చేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



రాజానగరంలో వైద్య శిబిరం ప్రారంభ సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

అన్నదాత సమస్యలకు తక్షణ పరిష్కారం

- ఐ.పంగిడిలో వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్ మాధవీలత
- 15,087 మందికి రూ. 11.16 కోట్ల మేర లబ్ధి

కొవ్వూరు: రైతుల సమస్యల్ని సత్వరమే పరిష్కరించేందుకు అధికారం యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి జడ్పీ హైస్కూలులో శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా నిర్వహించిన రైతు సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15,087 మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా రూ.11.16 కోట్లు అందిస్తున్నామన్నారు. ఈ సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. రైతులకు నమూనా చెక్కును అందజేశారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి నష్టపోయిన రైతులకు బీమా సాయం అందిస్తుందన్నారు. వర్చువల్ విధానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గోపాలపురం,నిడదవోలు అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు,రాజమహేంద్రవరం,కొవ్వూరు,గోపాలపురంలో పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలల్ని ప్రారంభించారన్నారు. ప్రతిభ కనబరిచిన వ్యవసాయ శాఖ అధికారులు,సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఆమె అందజేశారు.



వైఎస్సార్ ఉచిత పంట బీమా నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

రైతుల కోసం ఎక్కువ పథకాలు

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ దేశంలో రైతుల కోసం అత్యధిక పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటే అన్నారు. గతంలో ఎరువులు,విత్తనాల కోసం క్యూలలో నిరీక్షించాల్సి రావడం చూశామన్నారు. ఇప్పుడు దగ్గరలోని ఆర్బీకేల ద్వారా అవి అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాలో వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా 180 ట్రాక్టర్లు అందించామన్నారు. అనంతరం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత పాల్గొన్నారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులను లబ్ధిదారులకు కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వి.రాధాకృష్ణ,జిల్లా అగ్రి ట్రేడ్,మార్కెంటింగ్ అధికారి సునీల్ వినయ్, డీఎల్‌డీవో శాంతమణి, అరటి పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త కె.రామనందం, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎస్‌జీటీ సత్యగోవిందు తదితరులు పాల్గొన్నారు.

చదువుల గుడి.. సంబరబడి

- పాఠశాల వజ్రోత్సవానికి సిద్ధం
- వేగేశ్వరపురం కేఎస్ఆర్ పాఠశాలకు 75 ఏళ్లు
- అపూర్వ సమ్మేళనానికి తరలి వస్తున్న ప్రముఖులు, పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి: చదువులమ్మ ఆలయానికి 75 ఏళ్ల పండగ. తమ బాల్య స్మృతులను నెమరు వేసుకుంటూ పూర్వ విద్యార్థులందరూ తరలి వస్తున్నారు. వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వోన్నత పాఠశాల వజ్రోత్సవం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

కార్యక్రమం ఇలా..

వజ్రోత్సవ కార్యక్రమం ఆదివారం ఉదయమే సభ్యుల నమోదుతో ప్రారంభం అవుతుంది. అనంతరం సభా కార్యక్రమం, విశిష్ట అతిథులకు ఆహ్వానం, పూర్వ విద్యార్థుల ప్రసంగాలు, పాఠశాల సావనీర్, వేగేశ్వరపురం గ్రామంపై మనాశ్రీ రాసిన గేయం ఆవిష్కరణ ఉంటాయి. అనంతరం గురు వందనం, మధ్యాహ్నం పూర్వ విద్యార్థుల జ్ఞాపకాలు, విశిష్ట సేవలు చేసిన వారికి సత్కారం జరుగుతాయి. తర్వాత పాఠశాల, కాలేజీ విద్యార్థుల సమీక్ష , సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8 గంటలకు వందన సమర్పణతో వేడుక ముగుస్తుంది. సుమారు రెండు వేలకు మందికి భోజనం, అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు.ముఖ్య అతిథులుగా హోం మంత్రి తానేటి వనిత, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కలెక్టర్ కె.మాధవీలత, రిటైర్డ్ ప్రొఫెసర్ కేవీ సుబ్బారావు తదితరులు హాజరవుతున్నారు.



వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం

ఇదీ చరిత్ర...

చుట్టు ప్రక్కల గ్రామాల్లో పాఠశాలలు లేని రోజుల్లో అప్పటి సర్పంచ్ దివంగత కైగాల సూర్యచంద్రరావు కృషి ఫలితంగా 1946లో రెండు పాకల్లో ఈ ఉన్నత పాఠశాల పురుడు పోసుకుంది. కైగాల విగ్రహాన్ని 1975లో పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. లోగడ ఈ పాఠశాల్లో చదివిన వారు ప్రస్తుతం దేశ,విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. నాటి పాఠశాల భవనం 2010 నాటికి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దాంతో పాఠశాల వ్యవస్థాపకుడి వారసుడు, ఐఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కైగాల వెంకటసుబ్బారావు భవనాల పునఃనిర్మాణానికి విశేష కృషి చేశారు. ఆయన ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేశారు. దాతలు, గ్రామస్తులు, ప్రభుత్వం తోడ్పాటుతో 2014లో పాఠశాల నూతన భవనాలకు శ్రీకారం చుట్టారు. రెండతస్తుల్లో అత్యాధునిక భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఈ పాఠశాల 2016లో టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది.





క్లుప్తంగా

డబుల్ ధమాకా..



కవల దూడలకు జన్మనిచ్చిన ఆవు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాలలో శనివారం ఓ ఆవుకు కవల దూడలు పుట్టాయి. ఈ గోశాలలో 15 ఏళ్లుగా వందకు పైగా గోవులు ఆశ్రయం పొందుతున్నాయి. ఇన్నేళ్లలో ఇక్కడ ఆవుకు కవల దూడలు పుట్టడం ఇదే తొలి సారని గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు ఆనందంగా చెప్పారు. ఆవు, దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని పశు సంవర్ధక శాఖ అమలాపురం సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి చెప్పారు.

కొడుకును చూడటానికి వచ్చి.. తల్లి మృత్యువాత



లోవతల్లి మృతదేహం

తుని: పెద్ద కుమారుడితో కలిసి చిన్న కొడుకును చూడటానికి వచ్చిన తల్లిని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. తుని పట్టణ ఎస్సై మురళీమోహన్ కథనం ప్రకారం.. శంఖవరం మండలం మండపం గ్రామానికి చెందిన ఉండ్రు లోవతల్లి (35) చిన్న కుమారుడు తుని మండలం లోవకొత్తూరులోని బాలయోగి గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. అతడిని చూసేందుకు ఆమె తన పెద్ద కుమారుడు పవన్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై శనివారం తుని వచ్చారు. పట్టణంలో సామాన్లు కొనుగోలు చేసి వెళ్తుండగా.. వారి బైక్‌ను తుని నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న లోవతల్లి బస్సు కింద పడిపోయింది. తీవ్ర గాయాలైన ఆమెను తుని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందింది. పవన్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న లోవతల్లి భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదానికి కారణమైన బస్సును సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై మురళీమోహన్ తెలిపారు.

విరిసిన ఎర్ర మందారంలా..



గోరింటాకు పెట్టుకున్న చేతులు

- ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయం
- ఇన్‌ఫెక్షన్లు దరి చేరవని నమ్మకం
- ఆకట్టుకుంటున్న రకరకాల డిజైన్లు



కొవ్వూరు యానాద కాలనీలో గోరింటాకు కోస్తున్న మహిళలు

కొవ్వూరు: ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు.. ఆరేళ్ల బాలికల నుంచి అరవయ్యేళ్ల ముత్తయిదువల వరకూ ఒకటే సందడి.. గోరింటాకు కోసుకునో, కొనుక్కునో తెచ్చుకోవడం.. దానిని ముద్దగా నూరడం.. చేతి, కాలి వేళ్లకు, పాదాలపై రకరకాల డిజైన్లలో పెట్టుకోవడం.. అరచేతిలో, అరికాలిలో చందమామలానో.. మరేదైనా డిజైన్‌తోనో అద్దుకోవడం.. కొంతసేపు ఆరిన తరువాత దానిని తొలగించి.. శుభ్రంగా కడుక్కుని ఎంత ఎర్రగా పండిందో చూసుకుని మురిసిపోవడం.. వారి మురిపాలు చూసి అన్నదమ్ములు, నాన్న, బాబాయ్‌లు, మామయ్యలు.. ఇలా పురుషపుంగవులంతా ఆనందించడం.. ఇదంతా ప్రతి ఇంటా కనిపించే గొప్ప ముచ్చట. గోరింటాకు పేరిట దర్శకరత్న దాసరి నారాయణరావు ఏకంగా ఓ సినిమాయే తీశారు. ఆ సినిమాకు దేవులపల్లి కృష్ణశాస్త్రి ఏకంగా 'గోరింటా పూసింది కొమ్మా లేకుండా.. మురిపాల అరచేత మొగ్గా తొడిగింది' అంటూ ఓ పాటే రాసేశారు.

సౌభాగ్య చిహ్నంగా..

సండే స్పెషల్

గోరింటాకును స్త్రీలు సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తారు. గోరింటాకు అంటే 'గోటికి అంటు ఆకు' అని అర్థమట. దీనిని 'న కరంజనీ' అని కూడా అంటారు. అంటే గోళ్లను పండించేది అని అర్థం. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం ఎంతో మంచిదని పెద్దలు చెబుతారు. గోరింటాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచి భర్త వస్తాడని, దాంపత్యం అంత అన్యోన్యంగా ఉంటుందని చాలామంది విశ్వసిస్తారు. కొత్త పెళ్లి కూతుళ్లు ఈ మాసంలో కచ్చితంగా గోరింటాకు పెట్టుకోవాలని అంటారు.



గౌరీ ఇంటి ఆకే..

గోరింటాకు ఆవిర్భావం వెనుక చిత్రమైన కథ చెబుతారు. చిన్నతనంలో గౌరీదేవి రజస్వల అయి, ఆమె రక్తపు బొట్టు నేలకు తాకడంతో ఈ మొక్క ఉద్భవించిందంటారు. తండ్రి పర్వతరాజు సతీసమేతంగా వచ్చి చూస్తే ఆ చెట్టు పెద్దదై ఉంటుంది. గౌరీదేవి ఆ చెట్టు ఆకులు కోస్తే చేతులు ఎర్రగా పండిపోతాయి. బిడ్డ చేతులు కందిపోయానని పర్వతరాజు భావించగా, తన చేతులకేమీ కాలేదని, ఎర్రబడి, కొత్త అలంకారంతో మరింత అందంగా ఉన్నాయని ఆమె చెబుతుంది. దీంతో సంతోషించిన పర్వతరాజు ఇకపై ఈ మొక్క ఆకు స్త్రీ సౌభాగ్య చిహ్నంగా లోకంలో ప్రసిద్ధి చెందుతుందని చెప్పాడట. అలా గౌరీదేవి ఇంట ఉద్భవించిన 'గౌరీ ఇంటి ఆకు'.. క్రమంగా గోరింటాకుగా మారిందంటారు. రజస్వల సమయాన ఉద్భవించిన ఈ చెట్టు స్త్రీల గర్భాశయ సమస్యలను తొలగిస్తుందని చెబుతారు.

గోరింటాకే శ్రేయస్కరం



గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మార్కెట్‌లోకి వచ్చే కోన్‌లలో గోరింటాకుతో పాటు వివిధ రసాయనాలుంటాయి. సహజసిద్ధంగా లభ్యమయ్యే గోరింటాకు వినియోగించడమే శ్రేయస్కరం.

– కొండపల్లి నాగేశ్వరి, గృహిణి, కొవ్వూరు

ఆరోగ్య రీత్యా మేలు



ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం పూర్వం నుంచీ వస్తున్న సంప్రదాయం. ఈ మాసంలోనే కాలం ఉత్తరాయణం నుంచి దక్షిణాయానంలోకి మారుతుంది. వర్షాలు ప్రారంభమయ్యే సమయం కావడంతో ఔషధ గుణాలున్న గోరింటాకు ఆరోగ్య రీత్యా కూడా మేలు చేస్తుందని పెద్దలు చెబుతారు.

– యనమండ్ర సూర్యనారాయణమూర్తి, పండితుడు, కొవ్వూరు

మెహందీ రూపంలో కొత్త పుంతలు



ఒకప్పుడు ఇంట్లో ఏ శుభ కార్యం జరిగినా మహిళలు వీలైనంత వరకూ గోరింటాకు తప్పనిసరిగా పెట్టుకునే వారు. గోరింటాకు దొరకని వారికి ఒకింత అసంతృప్తి మిగిలేది. ఇప్పుడా బాధ లేకుండా.. చాలా కాలం నుంచి మెహందీ అందుబాటులోకి వచ్చింది. ఏ ఇంట్లో ఫంక్షన్లు జరిగినా మెహందీకి ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా ఇటీవల కొన్నాళ్లుగా పెళ్లిళ్లు, పండగలు, ఇతర ఫంక్షన్లలో ఆడవాళ్లంతా సమూహంగా చేరి గోరింటాకు (మెహందీ) పెట్టుకోవడాన్ని ప్రత్యేక వేడుకగా నిర్వహిస్తున్నారు. దీనిని స్టేటస్ సింబల్‌గా కూడా భావిస్తున్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన మహిళలు వివిధ రకాల ఆకర్షణీయమైన డిజైన్లలో కోన్‌లతో మెహందీ పెడుతున్నారు. పెళ్లికూతురి రెండు చేతులకూ మెహందీ పెట్టడానికి రూ.1,500 నుంచి రూ.2 వేల వరకూ తీసుకుంటున్నారు. డిజైన్‌ను బట్టి ధర ఉంటుంది. ఒక్కో వేడుకకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వెచ్చిస్తున్నారంటే మెహందీకి ఎంత క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.



వివిధ రకాల మెహందీ కోన్‌లు

ఎన్నో ఉపయోగాలు

- గోరింటాకు ఏడాది పొడవునా పెట్టుకోవచ్చు. అలా చేయడం లేదని కనీసం ఆషాఢ మాసంలోనైనా తప్పనిసరిగా పెట్టుకోవాలని పెద్దలు ప్రోత్సహిస్తున్నారు. ఆషాఢంతోనే వేసవి ముగిసి.. వర్ష రుతువు ఆరంభమవుతుంది. ఈ సమయంలో తరచూ వానల్లో తడుస్తూండటం, బురదలో తిరగడం వలన వివిధ రకాల ఇన్ఫెక్షన్లు, గోళ్లల్లో మట్టి ఉండిపోవడం, ఒరుపులు, పాచిపోవడం, పిప్పిగోళ్లు, చర్మవ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీటికి అడ్డుకట్ట వేయడానికి గోరింటాకు ఉపకరిస్తుందని చెబుతారు. అందుకే పెద్దలు అరికాళ్లకు, పాదాలకు, చేతులకు, గోళ్లకు పూర్తి స్థాయిలో గోరింటాకు పెట్టుకునే వారు.
- శరీరంలోని వేడిని తొలగిస్తుంది.
- అరచేతిలో స్త్రీ గర్భాశయానికి సంబంధించిన నాడులుంటాయని, చేతికి గోరింటాకు పెట్టుకోవడం వలన అతి ఉష్ణం తగ్గి, మేలు జరుగుతుందని చెబుతారు.
- ఆయుర్వేదం ప్రకారం గోరింటాకులోని రసాయనాలు పుండ్లను మాన్పుతాయి.
- గోరింటాకు ప్రకృతి సహజసిద్ధంగా ప్రసాదించిన రంగు. తల నెరిసిన వారు రసాయనాలు కలిపిన హెయిర్ డైలు వాడటం వలన రకరకాల చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. దీనికి బదులు గోరింటాకు పెట్టుకోవడం ఎంతో మంచిదని చెబుతారు.
- కాళ్ల పగలడం సమస్య ఉన్న వారు గోరింటాకు పెట్టుకుంటే మంచి ఫలితాలుంటాయి.

మానసిక వైద్య విభాగానికి అధిక ప్రాధాన్యం

- సైకియాట్రిక్ విభాగంలో పీజీ సీట్ల పెంపు
- త్వరలో క్లినికల్ సైకాలజీ కోర్సులు
- వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరసింహం



సదస్సును ప్రారంభిస్తున్న వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య రంగానికి ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయని, మానసిక వైద్య విభాగానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఇందులో భాగంగానే సైకియాట్రిక్ విభాగంలో పీజీ సీట్లు పెంచారని రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ డీవీఎస్ఎల్ నరసింహం అన్నారు. మానస హాస్పిటల్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించే మానసిక వైద్య నిపుణుల రాష్ట్ర స్థాయి నాలుగో సదస్సు స్థానిక మంజీర ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నరసింహం మాట్లాడుతూ, త్వరలోనే క్లినికల్ సైకాలజీ కోర్సులు ప్రారంభిస్తామని చెప్పారు. టీటీడీ సహకారంతో తిరుపతిలో దీర్ఘకాలిక మానసిక రోగుల పునరావాస కేంద్రం కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటిని జిల్లా స్థాయిల్లో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మానసిక వైద్యానికి సంబంధించి ఇప్పటికే 25 డీ ఎడిక్షన్ సెంటర్లు పని చేస్తున్నాయని చెప్పారు. మానసిక వైద్య విభాగానికి న్యాయ, సామాజిక, విలువల పరంగా వస్తున్న సమస్యల పరిష్కారానికి స్టేట్ మెంటల్ హెల్త్ అథారిటీ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా స్థాయిల్లో ప్రాధికార సంస్థల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఎడిటర్స్ సావనీర్‌ను డాక్టర్ నరసింహం ఆవిష్కరించారు.

సదస్సును ప్రారంభించిన వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ, వర్సిటీ పరిధిలో 400 కాలేజీలు, 3 వేల మంది వైద్య విద్యార్థులు ఉన్నారని తెలిపారు. సైకియాట్రిక్ విభాగంలో 750 పీజీ సీట్లు పెంచడమే కాకుండా మానసిక వైద్య విభాగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఇండియన్ మానసిక వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ, మానసిక వైద్య విభాగాన్ని ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ, దీర్ఘకాలిక మానసిక రోగుల విషయంలో పునరావాస కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఈ సదస్సుకు 450 మంది ప్రతినిధులు హాజరయ్యారని ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కర్రి రామారెడ్డి చెప్పారు. వేదాలు, పురాణేతిహాసాలు బుద్ధి, మనస్సు, చిత్తం, అహం వంటి వాటిపై ఏం ప్రస్తావించాయో చెబుతూ.. రెండో రోజు సదస్సులో మహామహోపాధ్యాయలు శలాక రఘునాథశర్మ, విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రిలతో ముఖాముఖీ ఉంటుందని తెలిపారు. సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కర్రి మానస, డాక్టర్ జి.నాగభూషణం, వైస్ చైర్మన్ డాక్టర్ విజయగోపాల్, వైద్యులు జీవీఎస్ మూర్తి, ఎ.విజయచంద్రారెడ్డి, ఆర్‌వీ కిశోర్‌కుమార్, శ్రీనివాసతేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఏలేశ్వరం: మండలంలోని కొత్త యర్రవరంలో విద్యుత్ షాక్ తగిలి శనివారం ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్త యర్రవరం గ్రామంలో జీడిపిక్కల ఫ్యాక్టరీ ఏర్పాటుకు షెడ్ నిర్మిస్తున్నారు. ఈ పనులకు కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన కొప్పన దైవానందం (57), పెనమరెడ్డి వీరగణేశ్వరరావు, వెలుగుల అప్పలరాజు వచ్చారు. షెడ్ పై భాగంలో రేకులు వేసేందుకు ఈ ముగ్గురూ నిచ్చెన పట్టుకోగా పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో ముగ్గురూ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వీరిలో దైవానందం మృతి చెందగా మిగిలిన ఇద్దరిలో అప్పలరాజు పరిస్థితి విషమంగా ఉంది. వీరగణేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ఏలేశ్వరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎస్సై జి.సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై మృతుడి బంధువులు రాస్తారోకో చేశారు.

వైద్య కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో వైద్య కళాశాల నిర్మాణ పనులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులు ఈ నెల 15 నాటికి పూర్తి కావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్లాస్ రూముల్లో ఏసీ సౌకర్యం ఉన్నప్పటికీ తగినన్ని ఫ్యాన్లు వేయాలని సూచించారు. బెంచీల సంఖ్య పెంచాలన్నారు. వైద్య పరికరాలు త్వరగా ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి విభాగాధిపతితో మాట్లాడి, ఆయా గదుల్లో సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్లు కె.సాయికిరణ్, నజీర్, ఇతర విభాగాల అధిపతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.